సాక్షి
జనగామ
గురువారం । 23 । నవంబర్ । 2023



దూషిస్తున్నదని కడతేర్చాడు

ఓ వృద్ధురాలు దూషిస్తున్నదని కక్ష పెంచుకున్న వ్యక్తి ఆమెను దారుణంగా హత్యచేశాడు. నిందితున్ని పోలీసులు అరెస్ట్ చేశారు. - 10లో▸



ఉత్తమ ఫలితాలు సాధించాలి

వసతులను సద్వినియోగం చేసుకుని ఉత్తమ ఫలితాలు సాధించాలని గిరిజన సంక్షేమ శాఖ చీఫ్ ఇంజనీర్ శంకర్ అన్నారు. - 11లో▸

గరిష్ఠం/కనిష్ఠం
$30^0/23^0$

వాతావరణం

జిల్లాలో ఉదయం మంచుతో కూడిన చల్లని వాతావరణం ఉంటుంది. ఆకాశం అక్కడక్కడా మేఘావృతమవుతుంది. మధ్యాహ్నం ఉష్ణోగ్రతలు తగ్గుతాయి. రాత్రి పూట చలి పెరుగుతుంది.

ప్రచారంపై ఈ‘సీ’!

ఆరు రోజుల్లో ముగియనున్న ప్రచారం

- అభ్యర్థుల ప్రచారసరళిపై నిఘా..
- ఖర్చుల అంచనాల్లో అధికారులు
- ఎన్నికల నియమావళి అమలుపై సీరియస్
- ఉమ్మడి జిల్లా సరిహద్దుల్లో మరిన్ని చెక్‌పోస్టులు
- జిల్లాల సరిహద్దుల్లో విస్తృత తనిఖీలు



కారును సోదా చేస్తున్న పోలీస్ అధికారులు

సాక్షిప్రతినిధి, వరంగల్: సార్వత్రిక ఎన్నికల పోలింగ్‌కు మరో ఎనిమిది రోజులే మిగిలింది. ఆరు రోజుల్లో అభ్యర్థుల ప్రచారానికి తెరపడనుంది. ఈనేపథ్యంలో ఎన్నికల ప్రవర్తన నియమావళి, కోడ్ అమలుపై అధికారులు మరింత నిఘా పెంచారు. కేంద్ర ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు వీటిని పక్కాగా అమలు చేసేందుకు నిర్దేశిత బృందాల పని తీరును జిల్లా ఎన్నికల అధికారులు, ఎన్నికల పరిశీలకులు పర్యవేక్షిస్తున్నారు. మరోవైపు నగదు, మద్యం అక్రమ పంపిణీకి అడ్డుకట్ట వేసేలా.. పోలీసులు చర్యలు చేపట్టారు. ఉమ్మడి వరంగల్ జిల్లాలోని సరిహద్దు ప్రాంతాల్లో తనిఖీ కేంద్రాలను మరింత పటిష్టం చేశారు. 24 గంటలు చెక్‌పోస్టుల్లో అందుబాటులో ఉంటూ.. వాహనాలను, అనుమానితులను క్షుణ్ణంగా తనిఖీ చేసేలా చర్యలు చేపడుతున్నారు. ఎలాంటి ఆధారాలు లేని డబ్బును స్వాధీనం చేసుకుని ఐటీ అధికారులకు అప్పగిస్తున్నారు. ఇప్పటికే ఉమ్మడి జిల్లాలో రూ.65 కోట్లకుపైగా నగదు, ఆభరణాలు, ఇతర వస్తువులను స్వాధీనం చేసుకున్నారు.

సరిహద్దుల్లో మరింత కట్టుదిట్టం

ఉమ్మడి వరంగల్ చుట్టూ ఉన్న ఛత్తీస్‌గఢ్, మహారాష్ట్ర, ఆంధ్రప్రదేశ్ సరిహద్దుల్లో మరింత కట్టుదిట్టంగా చెక్‌పోస్టులు పనిచేసేలా చర్యలు తీసుకుంటున్నారు. ఛత్తీస్‌గఢ్‌లో ఇటీవల ఎన్నికలు ముగియగా.. ఆ రాష్ట్రంతో పాటు మహారాష్ట్ర, ఆంధ్రప్రదేశ్ సరిహద్దుల నుంచి డబ్బు, మద్యం సరఫరా కాకుండా తనిఖీలు ముమ్మరంగా చేస్తున్నారు. ఎన్నికల ప్రవర్తన నియమావళి అమల్లో భాగంగా అక్రమాల కట్టడికి చర్యలు మొదలయ్యాయి. ఓటర్లను ప్రలోభపెట్టి.. ఎన్నికలను ప్రభావితం చేసే ప్రయత్నాలకు పోలీసుశాఖ ఆ చెక్‌పోస్టుల ద్వారా అడ్డుకట్ట వేస్తోంది. మద్యం, డబ్బు, గంజాయి తదితర మాదక ద్రవ్యాలు, తాయిలాలుగా అందించే వస్తువులు రాకుండా ప్రతీ వాహనాన్ని చెక్ చేస్తున్నారు. అంతర్రాష్ట్ర సరిహద్దు కలిగిన చోట ఏర్పాటు చేసిన చెక్‌పోస్టుల్లో ఇతరశాఖల అధికారులూ ఉంటారు. ములుగు, జేఎస్ భూపాలపల్లి, మహబూబాబాద్ జిల్లాల నుంచి ఇతర ప్రాంతాలకు వెళ్లే మార్గాల్లో అంతర్ జిల్లాల చెక్‌పోస్టులు వేరుగా ఏర్పాటు చేసి తనిఖీలు చేపడుతున్నారు.

అంతర జిల్లాల సరిహద్దుల్లోనూ..

అంతర జిల్లాల సరిహద్దుల్లోనూ కట్టుదిట్టమైన నిఘా ఉండేలా పోలీసులు చర్యలు చేపట్టారు. ఇందుకోసం సిద్దిపేట, కరీంనగర్ జిల్లాలకు సరిహద్దులుగా ఉండే భీమదేవరపల్లి మండలం గట్ల నర్సింగాపూర్, ఎల్కతుర్తి మండలం పెంచికలపేట శివార్లలో రెండేసి చెక్‌పోస్టులను ఏర్పాటు చేశారు. ఎల్కతుర్తి సమీపంలోని అన్నాసాగర్ క్రాస్ వద్ద కూడా మరో చెక్‌పోస్ట్ ఉంది. ఖమ్మం, భువనగిరి జిల్లాల వైపు ఒక్కో చెక్‌పోస్టు ఏర్పాటు చేశారు. అలాగే.. వరంగల్, మహబూబాబాద్, ములుగు, జేఎస్ భూపాలపల్లి, జనగామ జిల్లాల సరిహద్దులతో పాటు నగరాల్లో కలిపి మొత్తం 24 డైనమిక్ చెక్‌పోస్టులు పని చేస్తున్నాయి. వీటిలో పూర్తిస్థాయిలో పోలీసు సిబ్బంది విధులు నిర్వహిస్తున్నారు.

ప్రచార ఆర్భాటాలపై నిరంతర నిఘా

మోడల్ కోడ్ ఆఫ్ కండక్ట్‌ను కట్టుదిట్టంగా అమలు చేసేందుకు ఎంసీసీ బృందాలు విస్తృతంగా తిరుగుతున్నాయి. మండల స్థాయిలో ఎంపీడీఓలు, గ్రామస్థాయిలో పంచాయతీ కార్యదర్శులు, పట్టణ ప్రాంతాల్లో కమిషనర్లు ఎంసీసీల అమలు తీరును పర్యవేక్షిస్తున్నారు. ఎన్నికల ప్రచార సమయంతో పాటు కోడ్ ఉల్లంఘన, నియమావళి అమలు కాకపోవడం వంటి వాటిపై వచ్చే ఫిర్యాదులపై ఫ్లయింగ్ స్క్వాడ్ బృందాలు తనిఖీలు ముమ్మరం చేశాయి. సీ–విజిల్ యాప్‌లో వచ్చిన ఫిర్యాదులపై స్పందించి చర్యలు తీసుకుంటున్నాయి. కేంద్ర ఎన్నికల సంఘం ఎన్‌జీఎంఎస్ (నేషనల్ గ్రీవెన్స్ మేనేజ్‌మెంట్ సిస్టం)కు రాజకీయ పార్టీల నుంచి వచ్చిన ఫిర్యాదులను స్వీకరిస్తున్నాయి. ఎన్నికల్లో వ్యయ నియంత్రణ అనేది లేకుండాపోతున్న నేపథ్యంలో కట్టడికి ఎన్నికల సంఘం మొదటిసారి నియోజకవర్గానికి ఒక అకౌంటింగ్ బృందాన్ని ఏర్పాటు చేసింది. ఈబృందాలు అభ్యర్థులకు దడ పుట్టిస్తున్నాయి. సరిహద్దు ప్రాంతాలతో పాటు సమస్యాత్మక ప్రాంతాల్లో మకాం వేసి నియమావళి అమలు తీరును స్టాటిస్టిక్ సర్వేలెన్స్ బృందాలు పర్యవేక్షిస్తున్నాయి. వీడియో సర్వేలెన్స్ బృందాలు సభల్లో రాజకీయ పార్టీలకు చెందిన నాయకులు, అభ్యర్థుల ప్రసంగాలను వీడియోలో చిత్రీకరిస్తున్నాయి. వీడియో వ్యూయింగ్ బృందాలు స్టాటిస్టిక్ సర్వేలెన్స్, వీడియో సర్వేలెన్స్ బృందాలతో పాటు ఫ్లయింగ్ స్క్వాడ్‌లోని వీడియోగ్రాఫర్స్ చిత్రీకరించిన వాటిని చూసి నియమావళి ఉల్లంఘనకు సంబంధించిన వాటిని గుర్తించి ఎన్నికల అధికారులకు నివేదిస్తున్నాయి.

ఎన్నికల నిర్వహణకు సర్వం సిద్ధం



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్, డీసీపీ

- కలెక్టర్ శివలింగయ్య, డీసీపీ సీతారాం



ఆర్‌ఓ ఆఫీస్‌లో బ్యాలెట్లను పరిశీలిస్తున్న కలెక్టర్

జనగామ రూరల్: శాసనసభ ఎన్నికలు జిల్లాలో నిర్వహించడానికి సర్వం సిద్ధం చేశామని జిల్లా ఎన్నికల అధికారి సీహెచ్.శివలింగయ్య అన్నారు. బుధవారం కలెక్టరేట్‌లో డీసీపీ సీతారాంతో కలిసి విలేకరులతో మాట్లాడారు. జిల్లాలో 7,16,320 మంది ఓటర్లు ఉన్నారని, ఈనెల 30న తమ ఓటు హక్కును వినియోగించుకోనున్నారని చెప్పారు. కొత్త ఓటరు జాబితాలను ఇప్పటికే ఆయా పార్టీల అభ్యర్థులకు అందజేశామన్నారు. జనగామలో 7,449 మంది స్టేషన్‌ఘన్‌పూర్ 6,174, పాలకుర్తి 7,760 మొత్తం 21,433 మంది నూతన ఓటర్లుగా నమోదయ్యారని పేర్కొన్నారు. హోం ఓటింగ్ కోసం 80 ఏళ్లు పైబడిన 929 మంది వృద్ధులు నమోదు చేసుకోగా 814 మందికి, 692 మంది పీడబ్ల్యూడీ పర్సన్స్ ఉండగా 662 మందికి అనుమతి ఇచ్చినట్లు తెలిపారు. 25వ తేదీ వరకు ఇంటి నుంచి ఓటింగ్ ప్రక్రియ ఉంటుందన్నారు. ఎన్నికల విధుల్లో పాల్గొన్న అధికారులకు పోస్టల్ బ్యాలెట్ ఉందని, వారికి కేటాయించిన ఆర్వో సెంటర్‌లోనే ఓటు వేయాల్సి ఉంటుందని స్పష్టం చేశారు. పోలింగ్‌కు కావాల్సిన ఈవీఎంలు, వీవీప్యాట్లు, బ్యాలెట్ పేపర్లు సిద్ధం చేసినట్లు వివరించారు.

మరిన్ని పోలీస్ బలగాలు

ప్రశాంత వాతారణంలో ప్రజలు ఓటింగ్‌లో పాల్గొనాలని డీసీపీ సీతారాం అన్నారు. జిల్లా వ్యాప్తంగా 861 పోలింగ్ కేంద్రాలు ఉండగా.. అందులో 240 సమస్యాత్మక సెంటర్లు ఉన్నట్లు గుర్తించినట్లు చెప్పారు. ఇప్పటికే రెండు కంపెనీల బీఎస్‌ఎఫ్ బలగాలు వచ్చాయని, మరిన్ని బలగాలు వస్తాయని తెలిపారు. సమావేశంలో మీడియా ఇన్‌చార్జ్ దామోదర్ రావు, డీపీఆర్వో రాజేంద్రప్రసాద్, ఏఓ రవీందర్ తదితరులు పాల్గొన్నారు.

రిటర్నింగ్ అధికారి కార్యాలయం పరిశీలన

జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ శివలింగయ్య జనగామ రిటర్నింగ్ అధికారి కార్యాలయాన్ని సందర్శించారు. నియోజకవర్గ పరిధిలో జరుగుతున్న పోస్టల్ బ్యాలెట్, హోం ఓటింగ్ 80 ప్లస్ ఓటర్ల వివరాలు అడిగి తెలుసుకున్నారు. జాప్యం లేకుండా షెడ్యూల్ ప్రకారం పనులు పూర్తి చేయాలని సంబంధిత సిబ్బందిని ఆదేశించారు.

పోలింగ్ సజావుగా నిర్వహించాలి : సీనియర్ డిప్యూటీ ఈసీ నితీష్ వ్యాస్

జనగామ రూరల్: పోలింగ్ సజావుగా నిర్వహించాలి.. ఇందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలని భారత సీనియర్ డిప్యూటీ ఎలక్షన్ కమిషనర్ నితీష్‌వ్యాస్ అన్నారు. సాధారణ ఎన్నికల ఏర్పాట్లపై ఆయన బుధవారం ఢిల్లీ నుంచి జిల్లా ఎన్నికల అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పోలింగ్ సిబ్బంది, ర్యాండమైజేషన్, ఓటరు గుర్తింపు కార్డుల పంపిణీ, ఓటరు సమాచార స్లిప్పులు, బ్యాలెట్ పత్రాల ముద్రణ, ఈవీఎం యంత్రాల కమిషనింగ్, ఇంటి నుంచి ఓటు సేకరణ, పోలింగ్ సిబ్బంది శిక్షణ తదితర అంశాలపై పలు సూచనలు చేశారు. వీసీలో పాల్గొన్న కలెక్టర్ శివలింగయ్య మాట్లాడుతూ.. పోలింగ్ నిర్వహణకు అవసరమైన శిక్షణ పూర్తయిందని, ఓటరు స్లిప్పులు పంపిణీ చేస్తున్నామని తెలిపారు. ఈనెల 27 నాటికి ఓటరు కార్డుల పంపిణీ పూర్తి చేస్తామని, పోలింగ్ విధులు నిర్వహించే సిబ్బందికి ఓటు హక్కు కల్పించేందుకు 25 నుంచి రిటర్నింగ్ కార్యాలయంలో పోస్టల్ బ్యాలెట్ ఏర్పాటు చేస్తున్నట్లు వివరించారు. కార్యక్రమంలో ఉప ఎన్నికల అధికారి సుహాసిని, సీపీఓ ఇస్మాయిల్, జేడీ రాంప్రసాద్, ఏఓ రవీందర్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

రిటర్నింగ్ అధికారికి ఫిర్యాదు



ఫిర్యాదు చూపిస్తున్న ముక్క స్వామి

జనగామ రూరల్: చౌడారంలో ఎన్నికల కోడ్‌కు విరుద్ధంగా సౌభాగ్యలక్ష్మి స్కీం పేరుతో ఓటర్లను ప్రలోభ పెడుతున్న బీఆర్‌ఎస్ నాయకులపై చర్య తీసుకోవాలని జనగామ ఎన్నికల రిటర్నింగ్ అధికారికి హిందూ ఎస్సీ రిజర్వేషన్ పరిరక్షణ సమితి అధికార ప్రతినిధి ముక్క స్వామి బుధవారం ఫిర్యాదు చేశారు. మహిళా గ్రూపు లీడర్ల ద్వారా దరఖాస్తుల పేరుతో జిరాక్స్ తీసుకున్నారని, వారిపై చర్య తీసుకోవాలని ఫిర్యాదులో పేర్కొన్నారు.

రోడ్డు ప్రమాదంలో తండ్రి మృతి

- కొడుకు పరిస్థితి విషమం..
- తీవ్ర గాయాలపాలైన భార్య
- ద్విచక్రవాహనంపై వెళ్తుండగా.. ఢీకొట్టిన గుర్తుతెలియని వాహనం



సంఘటన స్థలంలో ద్విచక్రవాహనం, మృతుడు

లింగాలఘణపురం: జనగామ–సూర్యాపేట రోడ్డులోని ఓ పత్తి మిల్లు సమీపాన బుధవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో రఘునాథపల్లి మండలం నారాయణపురం గ్రామానికి చెందిన మద్దూరు చంద్రమౌళి(50) అక్కడికక్కడే మృతి చెందాడు. ఆయన కొడుకు శ్రీకాంత్, భార్య లక్ష్మి తీవ్రంగా గాయపడ్డారు. ఈ ముగ్గురు ద్విచక్ర వాహనంపై దేవరుప్పుల మండలం సింగరాజుపల్లికి బంధువుల పంచాయితీ నిమిత్తం వెళ్లి తిరిగి వస్తున్నారు. జనగామ–సూర్యాపేట రోడ్డులో (పాత జేకేఎస్) పత్తిమిల్లు సమీపాన జనగామ నుంచి సూర్యాపేట వైపు వెళ్తున్న గుర్తు తెలియని వాహనం ఢీకొట్టింది. ఈ ఘటనలో చంద్రమౌళి అక్కడికక్కడే మృతి చెందగా అతడి కొడుకు శ్రీకాంత్‌కు తీవ్ర గాయాలయ్యాయి. భార్య లక్ష్మికి చేయి విరిగింది. వీరిని 108 అంబులెన్స్‌లో జనగామ ఏరియా ఆస్పత్రికి తరలించారు. విషయం తెలియగానే సంఘటన స్థలానికి చేరుకున్న ఎస్సై ప్రవీణ్.. కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు పేర్కొన్నారు.

న్యూస్‌రీల్

కళాకారులకు పురస్కారాలు



లింగాలఘణపురం: మండల పరిధి మాణిక్యాపురం ఒగ్గు కళాకారుడు చౌదరిపల్లి రోశయ్య, మండల కేంద్రానికి చెందిన చిందుయక్షగాన కళాకారుడు గడ్డం శ్రీనివాసులు విశిష్టసేవా పురస్కారాలు అందుకున్నారు. తెలంగాణ భాషా సాంస్కృతిక శాఖ సౌజన్యంతో సింగిడి సాంస్కృతిక ఫౌండేషన్ ఆధ్వర్యాన హైదరాబాద్ రవీంద్రభారతిలో మంగళవారం రాత్రి నిర్వహించిన కార్యక్రమంలో ఫౌండేషన్ డైరెక్టర్ డాక్టర్ డీఆర్‌కే.విశ్వకర్మ, లయన్ డాక్టర్ కిరణ్, సీఈఓ సుచిర్ ఇండియా సీఈఓ డాక్టర్ లయన్ కిరణ్‌కుమార్, పొట్టి శ్రీరాములు విశ్వవిద్యాలయం పూర్వ రిజిస్టార్ ఆచార్య గౌరీశంకర్, తెలంగాణ సాహిత్య అకాడమీ కార్యదర్శి డాక్టర్ ఎస్.బాలాచారి, గవర్నమెంట్ ఇండియా అసిస్టెంట్ రిజిస్ట్రార్ ఆఫ్ కంపెనీ మినిస్ట్రీ ఆఫ్ కార్పొరేట్ అఫైర్స్ శ్రీకర్ పాల్గొన్నారు.

బైండోవర్ ఉల్లంఘనకు రూ.లక్ష జరిమానా

రఘునాథపల్లి: కంచనపల్లికి చెందిన అమృతం అంజయ్య బైండోవర్ ఉల్లంఘించిన కేసులో రూ.లక్ష జరిమానా చెల్లించినట్లు ఎస్సై చాగర్ల రఘుపతి బుధవారం తెలిపారు. ఎన్నికల నేపథ్యంలో బెల్ట్‌షాపు నిర్వహించొద్దని అంజయ్యను ఇటీవల తహసీల్దార్ ఎదుట బైండోవర్ చేసినట్లు చెప్పారు. ఈనెల 14న టాస్క్‌ఫోర్స్ దాడుల్లో మళ్లీ బెల్ట్‌షాపు నిర్వహిస్తూ అంజయ్య పట్టుబడటంతో కేసు నమోదు చేశామన్నారు. బైండోవర్ ఉల్లంఘన కింద తహసీల్దార్ యుగేందర్ సమక్షంలో రూ.లక్ష జరిమానా చెల్లించినట్లు ఎస్సై వివరించారు.

రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా కరుణాకర్



స్టేషన్‌ఘన్‌పూర్: స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఆంగ్ల అధ్యాపకుడిగా పనిచేస్తున్న మాచర్ల కరుణాకర్ ఎస్సీ, ఎస్టీ గెజిటెడ్ అధ్యాపకుల సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా నియమితులయ్యారు. ఈ మేరకు సంఘం రాష్ట్ర అధ్యక్షుడు బరిగెల నారాయణ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా కరుణాకర్ ఘన్‌పూర్‌లో విలేకర్లతో మాట్లాడుతూ డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ ఆశయాలకు అనుగుణంగా ఎస్సీ, ఎస్టీ ఉద్యోగుల సంక్షేమం, సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానన్నారు.

డిగ్రీ పరీక్షల ఫీజు చెల్లించాలి

కేయూ క్యాంపస్: కేయూ పరిధి ఉమ్మడి వరంగల్, ఖమ్మం, ఆదిలాబాద్ జిల్లాల్లో డిగ్రీ కోర్సుల మొదటి, మూడో, ఐదో సెమిస్టర్ (రెగ్యులర్, బ్యాక్‌లాగ్) విద్యార్థులు అపరాధ రుసుము లేకుండా పరీక్షల ఫీజు డిసెంబర్ 4 వరకు చెల్లించాలని కేయూ పరీక్షల నియంత్రణాధికారి ఆచార్య మల్లారెడ్డి తెలిపారు. రూ.50 అపరాధ రుసుముతో డిసెంబర్ 8 వరకు గడువు ఉందన్నారు. కాగా.. పరీక్షల ఫీజు కళాశాలల యాజమాన్యాలు ఎక్కువగా వసూలు చేస్తున్నట్లు తమ దృష్టికి వచ్చిందని, నిర్దేశించిన ఫీజులు మాత్రమే వసూలు చేయాలన్నారు. అన్ని కళాశాలలు పరీక్షల ఫీజు నోటిఫికేషన్‌ను విధిగా నోటీస్ బోర్డుపై ఉంచాలని ఆదేశించారు.

దూరవిద్య ఎంబీఏ ఫస్ట్ సెమిస్టర్ పరీక్షలు

కేయూ క్యాంపస్: కేయూ పరిధి దూరవిద్య ఎంబీఏ ఫస్టియర్ మొదటి సెమిస్టర్ ఎక్స్ విద్యార్థులకు డిసెంబర్ 6 నుంచి పరీక్షలు నిర్వహిస్తున్నట్లు పరీక్షల నియంత్రణాధికారి మల్లారెడ్డి, అదనపు పరీక్షల నియంత్రణాధికారి డాక్టర్ నరేందర్ తెలిపారు. డిసెంబర్ 6, 12, 16, 21, 28, జనవరి 3, జనవరి 8న మధ్యాహ్నం 2 నుంచి 5 గంటల వరకు పరీక్షలు ఉంటాయన్నారు.

‘పింగిళి’లో పీజీ కోర్సుల స్పాట్ అడ్మిషన్లు

విద్యారణ్యపురి: హనుమకొండలోని ప్రభుత్వ పింగిళి మహిళా డిగ్రీ, పీజీ కళాశాల(అటానమస్)లో 2023–24 విద్యా సంవత్సరంలో పీజీ కోర్సుల్లో ప్రవేశానికి స్పాట్ అడ్మిషన్లు నిర్వహించనున్నట్లు ప్రిన్సిపాల్ చంద్రమౌళి ఒక ప్రకటనలో తెలిపారు. సీపీ గేట్ ద్వారా అర్హత సాధించిన విద్యార్థులకు ఇప్పటికే ప్రవేశాలు జరగాయని పేర్కొన్నారు. అయితే వివిధ కోర్సుల్లో మిగిలి ఉన్న సీట్లలో ఈనెల 24న ఉదయం 11 గంటలకు ప్రభుత్వ పింగిళి మహిళా డిగ్రీ అండ్ పీజీ కళాశాలలో స్పాట్ అడ్మిషన్ల ప్రక్రియను సీపీ గేట్ కన్వీనర్ అనుమతితో నిర్వహిస్తున్నట్లు తెలిపారు. సీపీ గేట్‌లో అర్హత సాధించిన విద్యార్థులు అడ్మిషన్లు పొందవచ్చని పేర్కొన్నారు. అర్హత సాధించని వారు డిగ్రీ సబ్జెక్టుల్లో 50 శాతం మార్కులు కలిగి ఉండి అడ్మిషన్లు పొందవచ్చన్నారు. ఎంఏ తెలుగు, ఇంగ్లిష్, హిస్టరీ, ఎంకామ్, ఎమ్మెస్సీ బాటనీ, జువాలజీ, మైక్రోబయాలజీలో అడ్మిషన్లు పొందాలనుకునే విద్యార్థులు ఈనెల 24న నేరుగా కళాశాలలో జరిగే స్పాట్ అడ్మిషన్ల ప్రక్రియకు హాజరై అడ్మిషన్లు పొందవచ్చని తెలిపారు.

వడ్డెరలు శ్రమను నమ్ముకుంటారు

- ఎమ్మెల్యే తాటికొండ రాజయ్య



మాట్లాడుతున్న తాటికొండ రాజయ్య

బచ్చన్నపేట : అనాదిగా వడ్డెరలు శ్రమను నమ్ముకుని జీవిస్తున్నారని రైతుబంధు సమితి రాష్ట్ర కోఆర్డినేటర్, స్టేషన్‌ఘన్‌పూర్ ఎమ్మెల్యే తాటికొండ రాజయ్య అన్నారు. బుధవారం స్థానిక ఎస్‌వీ ఫంక్షన్ హాల్‌లో వడ్డెరల ఆత్మగౌరవ భవన సముదాయ ట్రస్ట్ ఆధ్వర్యంలో శివరాత్రి దుర్గయ్య, వెంకటస్వామి అధ్యక్షతన జనగామ నియోజకవర్గ వడ్డెరల ఆత్మీయ సమ్మేళనం ఏర్పాటు చేశారు. ట్రస్ట్ చైర్మన్ జేరిపేటి సత్యనారాయణ, వైస్ చైర్మన్ ఎత్తరి అంతయ్య మాట్లాడుతూ జనాభా దామాషా ప్రకారం అన్ని రంగాల్లో వాటా సాధించుకోవడానికి వడ్డెరలు ఐక్యంగా పోరాడాలని పిలుపునిచ్చారు. అర్హులందరికీ లేబర్ కార్డులు అందిస్తామని చెప్పారు. కార్యక్రమంలో డైరెక్టర్లు కొడిదల పోశయ్య, వెంకటస్వామి, బొంత పాండు, డి.కరుణాకర్, విష్ణు, గొలుసుల తిరుపతి, పల్లపు యాదగిరి, శ్రీనివాస్, నాగరాజు, బోదాసు శేఖర్, శివరాత్రి శ్రీకాంత్, తిరుపతి, మల్లికార్జున్, కొమ్మురాజుల చందు, కుంచపు మైసయ్య, మల్లయ్య, రవి తదితరులు పాల్గొన్నారు.

ఐదు చోట్ల ఓట్ల లెక్కింపు!

ఉమ్మడి జిల్లాలో కేంద్రాలు ఖరారు

- ఏనుమాములలో 5 అసెంబ్లీ స్థానాలవి..
- ములుగు, భూపాలపల్లి, మానుకోట, జనగామ ఎక్కడివక్కడే..
- డిసెంబర్ మూడున కౌంటింగ్‌కు కసరత్తు

హన్మకొండ అర్బన్: ఉమ్మడి వరంగల్ జిల్లాలో శాసనసభ ఎన్నికలను పకడ్బందీగా నిర్వహించేందుకు అధికారులు పక్కా ప్రణాళికతో ముందుకెళ్తున్నారు. ప్రచార గడువు దగ్గర పడుతుండడంతో ఒక వైపు పోలింగ్‌కు ఏర్పాట్లు చేస్తున్న అధికార యంత్రాంగం అంతే వేగంగా కౌంటింగ్ కోసం కసరత్తు మొదలు పెట్టింది. ఇప్పటికే రెండో విడత ఈవీఎంల ర్యాండమైజేషన్ పూర్తి చేశారు. ఉమ్మడి జిల్లా పరిధి మొత్తం 12 అసెంబ్లీ స్థానాలకు నవంబర్ 30న ఎన్నికలు, డిసెంబర్ 3న ఓట్ల లెక్కింపు ఉంటుంది. ఇందుకు ఉమ్మడి జిల్లాలో మొత్తం ఐదు లెక్కింపు కేంద్రాలను గుర్తించి ఏర్పాట్లు మొదలు పెట్టారు. గతంలో వరంగల్ ఏనుమాముల మార్కెట్ యార్డులోనే లెక్కింపు చేసి న అధికారులు ప్రసుత్తం జిల్లాల వారీగా విభజించారు. ఏనుమాముల మార్కెట్‌లో వరంగల్ పశ్చిమ, తూర్పు, వర్ధన్నపేట, నర్సంపేట, పరకాల(ఐదు) నియోజక వర్గాల ఓట్లు లెక్కించనున్నారు. జనగామ, స్టేషన్‌ఘన్‌పూర్, పాలకుర్తి నియోజకవర్గాల ఓట్లు జనగామ జిల్లా పెంబర్తిలోని విద్యాభారతి ఇంజనీరింగ్ కాలేజీలో చేపట్టనున్నారు. డోర్నకల్, మహబూబాబాద్ నియోజకవర్గాల ఓట్లు మహబూబాబాద్ సోషల్ వెల్ఫేర్ స్కూల్‌లో, భూపాలపల్లివి అక్కడి వీసీఈఆర్ క్లబ్‌లో, ములుగు ఓట్లు జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్ సమీప మీటింగ్ హాల్లో లెక్కించాలని నిర్ణయించారు. ఈ మేరకు రాష్ట్ర ఎన్నికల కమిషన్ కూడా కేంద్రాలను గుర్తిస్తూ జిల్లా అధికారులకు ఆదేశాలిచ్చింది. జిల్లాల ఎన్నికల అధికారులు, ఆర్‌ఓలు ఏర్పాట్లు చేస్తున్నారు.

ఏర్పాట్లు మొదలు..


ఐదు నియోజకవర్గాలకు సంబంధించి కౌంటింగ్ నిర్వహించే హాల్స్‌లో నిరంతరం విద్యుత్ ఉండేలా ఏర్పాట్లు చేస్తున్నారు. అత్యవసరాలకు జనరేటర్లు అందుబాటులోకి తెచ్చారు. పోలింగ్ అనంతరం స్ట్రాంగ్ రూమ్‌లకు తరలించిన ఈవీఎంల వద్ద సాయుధ బలగాలతో మూడంచెల భద్రత కల్పిస్తారు. సీసీ కెమెరాలు తాగునీరు, లైటింగ్ బారికేడ్లు, టాయిలెట్స్ వంటి సదుపాయాలు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకుంటున్నారు. కౌంటింగ్ కేంద్రాలో అవసరమైన బోర్డులు, రిజిస్టర్స్, పోస్టల్ బ్యాలెట్ లెక్కింపునకు అవసరమయ్యే బాక్స్‌లను సిద్ధం చేసిన అధికారుల.. కౌంటింగ్ టేబుల్స్, జాలీలు వంటివి ఏర్పాటు చేస్తున్నారు. వీటి పనులు మొదలయ్యాయి. ఇప్పటికే హనుమకొండ, వరంగల్ జిల్లాల కలెక్టర్లు సిక్తా పట్నాయక్, ప్రావీణ్య.. రాజకీయ పార్టీల ప్రతినిధులు, అభ్యర్థుల ఏజెంట్లతో కలిసి ఏనుమాముల గోదాంలో లెక్కింపు కేంద్రాలు, స్ట్రాంగ్ రూంలను పరిశీలించారు. ఈవీఎంల భద్రత, కౌంటింగ్ ఏర్పాట్ల గురించి వివరించారు. త్వరలో కౌంటింగ్ అధికారులు, సిబ్బందికి శిక్షణ ఇవ్వనున్నారు.

నియోజకవర్గం	పోలింగ్ కేంద్రాలు	పోటీ చేస్తున్న అభ్యర్థులు	కౌంటింగ్ కేంద్రం
జనగామ	277	19	విద్యాభారతి ఇంజనీరింగ్ కాలేజీ, పెంబర్తి, జనగామ
స్టేషన్ ఘన్‌పూర్	290	19	విద్యాభారతి ఇంజనీరింగ్ కాలేజీ, పెంబర్తి
పాలకుర్తి	294	15	విద్యాభారతి ఇంజనీరింగ్ కాలేజీ, పెంబర్తి, జనగామ
డోర్నకల్	256	14	సోషల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ స్కూల్, మహబూబాబాద్
మహబూబాబాద్	283	12	సోషల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ స్కూల్, మహబూబాబాద్
నర్సంపేట	283	16	గోదాం నం 17/ఏ, ఏనుమాముల మార్కెట్, వరంగల్
పరకాల	239	28	గోదాం నం 4/సీ, ఏనుమాముల మార్కెట్, వరంగల్
వరంగల్ పశ్చిమ	245	15	గోడౌన్ నం 4/డీ, ఏనుమాముల మార్కెట్, వరంగల్
వరంగల్ తూర్పు	230	29	గోడౌన్ నం 17/బీ, ఏనుమాముల మార్కెట్, వరంగల్
వర్ధన్నపేట	278	14	గోడౌన్ నం 17/సీ, ఏనుమాముల మార్కెట్, వరంగల్
భూపాలపల్లి	317	23	సీఈఆర్ క్లబ్, అంబేడ్కర్ స్టేడియం, భూపాలపల్లి
ములుగు	303	11	జిల్లా కలెక్టరేట్ ఎదురుగా ఉన్న మీటింగ్ హాల్‌లో

ప్రతిరోజూ ప్రజల ముంగిట..

జనగామ, చేర్యాల పట్టణాల సుందరీకరణ

- కొమురవెల్లి పుణ్యక్షేత్రాన్ని పర్యాటక కేంద్రంగా మారుస్తా..
- ప్రభుత్వ విద్య బలోపేతానికి కృషి
- నిరుద్యోగులకు ఉపాధి అవకాశాలు
- పార్టీ కేడర్ గౌరవం పెంచుతా..
- ‘సాక్షి’తో బీఆర్‌ఎస్ అభ్యర్థి పల్లా రాజేశ్వర్‌రెడ్డి



జనగామ: గెలుపొందిన తర్వాత ప్రతిరోజు ప్రజల ముంగిట ఉంటానని బీఆర్‌ఎస్ జనగామ ఎమ్మెల్యే అభ్యర్థి పల్లా రాజేశ్వర్‌రెడ్డి అన్నారు. అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో ఎమ్మెల్యేగా విజయం సాధిస్తే.. నియోజకవర్గ అభివృద్ధి, ప్రజాసమస్యలు, నిధుల సమీకరణ తదితర విషయాలపై బుధవారం ‘సాక్షి’కి ఇచ్చిన ఇంటర్వ్యూ వివరాలు ఆయన మాటల్లోనే..

జనగామ, చేర్యాల పట్టణంలో స్థిర నివాసం ఏర్పరచుకుని, నియోజకవర్గ సమస్యలు తెలుసుకునేందుకు రోజూ ఉదయం 7 గంటల నుంచి ప్రజలకు అవకాశం కల్పిస్తా. ప్రతీ ఒక్కరితో మాట్లాడుతా. పనులు, సమస్యలకు సంబంధించి వచ్చిన ప్రతి దరఖాస్తుపై దృష్టి పెడతా. పనులు పెండింగ్‌లో ఉంటే సంబంధిత అధికారులతో స్వయంగా మాట్లాడి సత్వర పరిష్కారానికి కృషి చేస్తా. 2014 తర్వాత తమకున్న ఎడ్యుకేషన్ సంస్థల పర్యవేక్షణ బాధ్యత పూర్తిగా సతీమణి నీలిమ, పిల్లలు చూసుకుంటున్నారు. నాకున్న బాధ్యతల్లా ప్రజలకు సేవ చేయడమే. ఎవరైనా నేరుగా వచ్చి సమస్యలు చెప్పుకునే విధంగా పాలన ఉంటుంది. జనగామ అభివృద్ధికి అవసరమైన సమయంలో ప్రగతి భవన్‌కు వెళ్లి కావాల్సిన నిధులు పట్టుకొస్తా.

53/1 సర్వే నంబర్‌లో అర్హులకు పట్టాలు..

జనగామ పట్టణం ధర్మకంచలో రెండు దశాబ్దాలుగా పెండింగ్‌లో ఉన్న 53/1 సర్వే నంబర్ పరిధిలో అర్హులందరికీ పట్టాలు ఇప్పించే బాధ్యత తీసుకుంటా. ఈ విషయంలో ఎవరూ ఆందోళన చెందాల్సిన అవసరం లేదు. జనగామ, చేర్యాల అభివృద్ధి హామీకి కట్టుబడి ఉంటా. జనగామ పట్టణంలో పార్కులను అభివృద్ధి చేసి ఆహ్లాదకర వాతావరణం కల్పిస్తా. మున్సిపాలిటీ పరిధి 30 వార్డుల్లో సీసీరోడ్ల నిర్మాణం, రంగప్పచెరువు, బతుకమ్మకుంటను మరింత సుందరీకరించడానికి చర్యలు చేపడతాను. చీటకోడూరు ఫిల్టర్ బెడ్ ద్వారా తాగు నీటిని మరింత శుద్ధి చేసి మూడు నెలల్లో ప్రతి ఒక్కరూ తాగేలా చేస్తాం. అంబేడ్కర్ భవనం, కమ్యూనిటీ హాళ్లు, కళానిలయం ఏర్పాటుపై దృష్టి పెడతా. చేర్యాల, పెదమల్లన్న చెరువులను అభివృద్ధి చేయడంతోపాటు కొమురవెల్లి పుణ్యక్షేత్రాన్ని పర్యాటక కేంద్రంగా మారుస్తాం.

‘తపాస్‌పల్లి’ సామర్థ్యం పెంపు

తపాస్‌పల్లి రిజర్వాయర్ సామర్థ్యాన్ని సుమారు రూ.350 కోట్ల నిధులతో 1.5 టీఎంసీలకు పెంచుతున్నాం. పెండింగ్‌లో ఉన్న కాల్వల నిర్మాణానికి భూ సేకరణ పూర్తి చేసి ప్రతీ ఎకరాకు సాగు నీరు అందిస్తాం. మల్లన్నసాగర్ మీదుగా తపాస్‌పల్లి నుంచి అన్ని మండలాలకు గ్రావిటీ ద్వారా సాగు నీరు అందించే విధంగా ప్లాన్ ఉంది.

నిరుద్యోగులకు ఉపాధి

జిల్లాలో ప్రభుత్వ విద్యను బలోపేతం చేసి నిరుద్యోగ యువతకు ఉపాధి అవకాశాలు కల్పిస్తాం. పాల ఉత్పత్తికి అనుగుణంగా ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్లు నెలకొల్పుతాం. పామాయిల్ సాగు ఎక్కువగా ఉన్న ఈ ప్రాంతంలో అందుకు తగినట్టుగా వ్యాపా రం జరిగేలా చూస్తాం. ఆగ్రోస్ బేస్డ్ విత్తనాల తయారీ కేంద్రం, పాలీటెక్నిక్, పారామెడికల్, వ్యవసాయ, ఇంజనీరింగ్ కళాశాలలతో ప్రభుత్వ విద్యా వ్యవస్థను మరింత బలోపేతం చేసే విధంగా ప్లాన్ చేసుకున్నాను. కాలక్రమేన జనగామను ఐటీహబ్‌గా మార్చేందుకు శక్తివంచన లేకుండా కృషి చేయడానికి సిద్ధంగా ఉన్నాను.

పార్టీ కేడర్‌కు సముచిత స్థానం..

పార్టీ కేడర్ కృషి, శ్రమ ఫలితంగానే ఈ ఎన్నికల్లో ముందుకు వెళ్తున్నాం. కార్యకర్తలు, నాయకుల శ్రమకు గౌరవం, సముచిత స్థానం ఉంటుంది. కార్యకర్తలు లేకుండా ఏదీ సాధించలేం. పైసా ఖర్చు లేకుండా.. జిల్లా, నియోజకవర్గ, మండల కమిటీల అభిప్రాయాలను పరిగణలోకి తీసుకుని నామినేటెడ్, పార్టీ పోస్టుల్లో ఉద్యమకారులతో పాటు అర్హులందరికీ అవకాశం కల్పిస్తాం.

SAKSHI INTERVIEW

‘కొమ్మూరి’తో నాకు పోటీ లేదు

కొమ్మూరి ప్రతాప్‌రెడ్డి స్వగ్రామం నర్సాయపల్లి జనగామకు ఎంతదూరమో.. నా ఊరు షోడశపల్లి అంతకంటే తక్కువ డిస్టెన్స్‌లో ఉంటుంది. ‘ఆదివారం ఎమ్మెల్యే’గా పేరు తెచ్చుకున్న ఆయన.. మిగతా వారు కూడా గట్లనే ఉంటారేమో అనుకుంటున్నరు. కొమ్మూరి మాదిరిగా ఇష్టం వచ్చినట్టు నేను మాట్లాడను. రౌడీల రాజ్యం ఉండదు. పదేళ్ల నుంచి వ్యాపారులు, అన్ని వర్గాల ప్రజలు ఎలా ప్రశాంతంగా ఉన్నారో అదే కంటిన్యూ అవుతుంది. నాలుగు పార్టీలు మారిన ఆయన.. పచ్చి అబద్దాలు మాట్లాడుతున్నారు. తన గురించి మాట్లాడే అర్హత కూడా ప్రతాప్‌రెడ్డికి లేదు. వ్యక్తిగత విమర్శలు సిగ్గుచేటు. కొమ్మూరితో తనకు ఎటువంటి పోటీ లేదు.

పరాయిపాలనకు స్వస్తి పలకాలి


దేవరుప్పుల: ప్రచారంలో మాట్లాడుతున్న యశస్వినిరెడ్డి


ఎన్నికల ప్రచారంలో పాల్గొన్న ప్రజలు

- ప్రకృతి వనరులను కూల్చి.. పేదల పొట్టగొడుతున్నారు
- కాంగ్రెస్ పార్టీ పాలకుర్తి అభ్యర్థి యశస్వినిరెడ్డి


తొర్రూరు: ఝాన్సీరెడ్డిని కలిసిన గౌడ ప్రతినిధులు


కొడకండ్ల: కాంగ్రెస్‌లో చేరిన వారితో ఝాన్సీరెడ్డి

దేవరుప్పుల : కొట్లాడి తెచ్చుకున్న ప్రత్యేక రాష్ట్రం మాదిరిగా చైతన్యవంతులైన నియోజకవర్గంలో పరాయిల పాలనకు పాలకుర్తి ప్రజలు స్వస్తి పలకాలని కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి మామిడాల యశస్వినిరెడ్డి అన్నారు. బుధవారం మండల పరిధి ముస్పహాడ్, గొల్లపల్లి, కామారెడ్డిగూడెం, సీతారాంపురం, కడవెండి, చిప్పరాళ్లబండతండాలో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా తెలంగాణ రైతాంగ సాయుధ పోరు, మలివిడత ఉద్యమాల్లో అమరులైన దొడ్డి కొమురయ్య, షేక్ బందగీ, కాసోజు శ్రీకాంతాచారికి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ప్రత్యేక తెలంగాణ తెచ్చుకున్నది మన వనరులు, ఉద్యోగాలు సాధించుకోవడానికి.. అయితే ఆచరణలో అలా జరగడం లేదు.. ప్రకృతి వనరులను కూల్చి ఉపాధి కల్పన పేరిట బడా కంపెనీల కోసం భూసేకరణ చేసి పేదల పొట్టగొట్టేందుకు పాలకులు యత్నిస్తున్నారని ఆరోపించారు. ముస్పహాడ్ రైతుల పక్షాన కాంగ్రెస్ అండగా ఉంటుందన్నారు. తనను ఆదరించి గెలిపిస్తే.. కామారెడ్డిగూడెంలో కాంగ్రెస్ హయాంలో శాశ్వత ప్రాతిపదికన చేపట్టిన బడి, రోడ్లు, ఇందిరమ్మ ఇళ్ల మాదిరిగా మిగిలిన పనులకు ప్రాధాన్యత ఇస్తామన్నారు. ప్రతీ కార్యకర్త సైనికుడిలా పనిచేసి నియోజకవర్గాన్ని 'హస్తగతం' చేసుకోవడానికి కృషి చేయాలని కోరారు. బీఆర్‌ఎస్ నియోజకవర్గ నాయకుడు ఎస్.ప్రవీణ్‌రావు, సీపీఐ జిల్లా నాయకులు బిల్లా తిరుపతిరెడ్డి, జీడీ ఎలయ్య, పార్టీ మండల అధ్యక్షుడు పెద్ది కృష్ణమూర్తి, ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షుడు నల్ల శ్రీరాములు, సీనియర్ నాయకులు ధర్మారెడ్డి, సురేష్‌బాబు, ఓడపల్లి రవీందర్, పారుపెల్లి శ్రీనివాస్, రెడ్డిరాజుల రమేష్, సోమనర్సొజీ, మహేందర్‌జీ, గ్రామ బాధ్యులు యాకన్న, వెంకన్న, రతన్‌జీ, రాంబాబు, యాకు పాల్గొన్నారు.

విద్యావంతుల సంపూర్ణ మద్దతు హర్షణీయం

ప్రభుత్వ మార్పు కోరే దిశలో కాంగ్రెస్ పార్టీకి విద్యావంతుల సంపూర్ణ మద్దతు హర్షణీయమని కాంగ్రెస్ పార్టీ పాలకుర్తి నియోజకవర్గ ఇన్‌చార్జ్ హనుమాండ్ల ఝాన్సీ రెడ్డి అన్నారు. బుధవారం పాలకుర్తి దేవస్థాన కమిటీ మాజీ చైర్మన్ చిలువేరు కృష్ణమూర్తి, పార్టీ మండల అధ్యక్షుడు పెద్ది కృష్ణమూర్తి, పులిగిళ్ల వెంకన్న ఆధ్వర్యంలో బీఆర్‌ఎస్ పార్టీ సీనియర్ నాయకులు, సామాజిక న్యాయవేదిక, యాదవ విద్యావంతుల వేదిక జిల్లా అధ్యక్షుడు తోటకూరి పాండుకృష్ణ కాంగ్రెస్‌లో చేరారు. పార్టీలో చేరిన పులిగిల్ల ఎల్లయ్య, జక్కుల సోమయ్య, రాసాల ఐలయ్య, ఆదర్శ రైతు రాసాల మల్లయ్య, తోటకూరి రవీందర్, వేల్పుల ఎల్లయ్య ఉన్నారు.

ఉన్నత విద్యావంతులను ఉపాధి కూలీలుగా మార్చారు: లక్ష్మీనారాయణనాయక్

ఉన్నత విద్యావంతులను సైతం ఉపాధి కూలీలుగా మార్చిన ఘనత బీఆర్‌ఎస్ ప్రభుత్వానికే దక్కుతుందని టీపీసీసీ సభ్యుడు డాక్టర్ లకావత్ లక్ష్మీనారాయణ నాయక్ విమర్శించారు. బుధవారం మండలంలోని ధరావత్‌తండా, ధర్మగడ్డలో నియోజకవర్గ పరిశీలకులు రాజేష్ రాథోడ్‌తో కలిసి కాంగ్రెస్ పార్టీ గెలుపు కోసం తండాబాట ప్రచారం చేపట్టారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ.. గతంలో పోల్చుకుంటే గిరిజనుల్లో అక్షరాస్యత పెరిగి చైతన్యవంతులయ్యారన్నారు. కార్యక్రమంలో యాదా నాయక్, ధరావత్ రవీందర్ నాయక్, నల్ల యాదగిరి, దేవ, బీకోజీ, కిషన్, కీమా, శ్రీను పాల్గొన్నారు.

ఎర్రబెల్లికి పరాభవం తప్పదు: ఝాన్సీరెడ్డి

కొడకండ్ల : మాటల మాంత్రికుడు దయాకర్‌రావుకు ఈ ఎన్నికల్లో ప్రజల చేతిలో పరాభవం తప్పదని కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ హనుమాండ్ల ఝాన్సీరెడ్డి అన్నారు. బుధవారం నర్సింగాపురం మాజీ సర్పంచ్ పనస రాందాస్ గౌడ్, వార్డు సభ్యుడు ముత్యం వెంకన్న, గుర్రం లింగయ్య, సోమయ్య ఆధ్వర్యంలో బీఆర్‌ఎస్ నుంచి కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. కాంగ్రెస్ పార్టీ ఆరు గ్యారంటీ పథకాలకు నియోజకవర్గ వ్యాప్తంగా ప్రజల నుంచి అపూర్వ స్పందన లభిస్తోందని, పెద్ద ఎత్తున పార్టీలో చేరుతున్నారని అన్నారు. ఈ ఎన్నికల్లో దయాకర్‌రావును ఓడించి పర్వతగిరికి పంపేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారని, కాంగ్రెస్ కార్యకర్తలు, నాయకులు కలిసికట్టుగా సైనికుల్లా పనిచేసి కాంగ్రెస్ అభ్యర్థి యశస్వినిరెడ్డికి భారీ మెజార్టీ వచ్చేలా కృషి చేయాలని కోరారు. కాంగ్రెస్ మండల అధ్యక్షుడు సురేష్‌నాయక్, రమేష్, రంగయ్య, యాకన్న, సోమయ్య తదితరులు పాల్గొన్నారు.

మార్పు కోరుతున్న పాలకుర్తి ప్రజలు

పాలకుర్తిటౌన్ : పాలకుర్తి ప్రజలు మార్పు కోరుకుంటున్నారని కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జ్ హనుమాండ్ల ఝాన్సీరెడ్డి అన్నారు. మండలంలోని ముత్తారం, మల్లంపల్లి, పాలకుర్తితో పాటు పలు గ్రామాలకు చెందిన బీఆర్‌ఎస్ నాయకులు బుధవారం అధిక సంఖ్యలో కాంగ్రెస్‌లో చేరారు. ముత్తారం, పాలకుర్తి మాజీ సర్పంచ్‌లు భూమ రంగయ్య, అంగడి అంజమ్మ, మల్లంపల్లి ఉప సర్పంచ్ తంగళపల్లి యాకయ్యతో పలువురు బీఆర్‌ఎస్ నాయకులు కాంగ్రెస్‌లో చేరగా ఝాన్సీరెడ్డి వారికి కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పాలకుర్తిలో కాంగ్రెస్ యశస్వినిరెడ్డికి ఆదరణ పెరిగిందని, ఊహించని రీతిలో కాంగ్రెస్ గెలుపొందడం ఖాయమన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు గిరగాని కుమారస్వామి, నాయకులు చిలువేరు కృష్ణమూర్తి, బైరు భార్గవ్, అంజిరావు పాల్గొన్నారు.

యశస్వినిరెడ్డికి గౌడ కులస్తుల మద్దతు

తొర్రూరు : పాలకుర్తి కాంగ్రెస్ ఎమ్మెల్యే అభ్యర్థి యశస్వినిరెడ్డికి స్థానిక గౌడ సామాజికవర్గ ప్రతినిధులు మద్దతు తెలిపారు. బుధవారం డివిజన్ కేంద్రంలోని కాంగ్రెస్ క్యాంపు కార్యాలయంలో నియోజకవర్గ ఇన్‌చార్జ్ ఝాన్సీరెడ్డిని మర్యాద పూర్వకంగా కలిసి సంపూర్ణ మద్దతు తెలుపుతున్నట్లు చెప్పారు. పలువురు కాంగ్రెస్‌లో చేరారు. కార్యక్రమంలో గౌడ ప్రతినిధులు జలగం రామ్మూర్తిగౌడ్, రమేష్‌గౌడ్, బొమ్మగాని నర్సయ్య, యాకయ్య, చీకటి శంకరయ్య, బండి పుల్లయ్య తదితరులు పాల్గొన్నారు.


దూషిస్తోన్నదని కడతేర్చాడు..

- వృద్ధురాలి హత్య కేసులో నిందితుడి అరెస్టు


నిందితుడి అరెస్టు చూపుతున్న ఏసీపీ రఘుచందర్

జఫర్‌గఢ్ : మండలంలోని తీగారం గ్రామానికి చెందిన వృద్ధురాలు ముస్కు రామనర్సమ్మ(60)ను దారుణంగా హత్య చేసిన నిందితుడిని అరెస్టు చేసినట్లు వర్ధన్నపేట ఏసీపీ రఘుచందర్, సీఐ శ్రీనివాస్, ఎస్సై మహేందర్ తెలిపారు. స్థానిక పోలీస్ స్టేషన్‌లో బుధవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు వివరాలు వెల్లడించారు. జనగామ జిల్లా జఫర్‌గఢ్ మండలం తీగారం గ్రామానికి చెందిన సింగిరెడ్డి రవి ఈ నెల 20వ తేదీన రాత్రి ఒంటరిగా ఉంటున్న రామనర్సమ్మను ఇంటికి వెళ్లాడు. ఆమెతో మాట్లాడుతూనే తన వెంట తీసుకొచ్చిన కత్తితో గొంతు కోసి, పొట్టలో పొడవడంతో రామనర్సమ్మ అక్కడికక్కడే మృతి చెందింది. ఈ ఘటనపై మృతురాలి కుమార్తె ఫిర్యాదు మేరకు విచారణ చేపట్టిన పోలీసులు.. సింగిరెడ్డి రవి వృద్ధురాలిని హత్య చేసినట్లు గుర్తించారు. అనంతరం అదుపులోకి తీసుకుని విచారించగా కొద్ది రోజుల నుంచి రామనర్సమ్మ తనను ఇష్టం వచ్చినట్లు దూషిస్తోన్నదని, దీంతో ఆమెపై కక్ష పెంచుకుని ఎవ రూ లేని సమయంలో హత్య చేసినట్లు ఒప్పుకున్నట్లు పోలీసులు పేర్కొన్నారు. నిందితుడి నుంచి హత్యకు ఉపయోగించిన కత్తిని స్వాధీనం చేసుకుని రిమాండ్‌కు తరలించినట్లు తెలిపారు. నిందితుడిపై ఇదివరకే 2004లో వరకట్నం కోసం రెండో భార్యను చంపిన కేసు నమోదై ఉన్నట్లు వారు పేర్కొన్నారు. కాగా, ఘటన జరిగిన 24 గంటల్లోనే పోలీసులు నిందితుడిని అరెస్ట్ చేయడంపై గ్రామస్తులు అభినందనలు తెలిపారు.

ఐఈఎస్‌లో అభిషేక్‌కు 42వ ర్యాంకు


వేముగంటి అభిషేక్

స్టేషన్‌ఘన్‌పూర్ : యూనియన్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ నిర్వహించిన ఐఈఎస్(ఇండియన్ ఇంజనీరింగ్ సర్వీసెస్)లో మండలంలోని శివునిపల్లికి చెందిన వేముగంటి రాంప్రసాద్, శ్రీదేవిల కుమారుడు అభిషేక్ ఆల్ ఇండియా 42వ ర్యాంకు సాధించాడు. ఐఈఎస్ ఫైనల్ రిజల్ట్స్ బుధవారం వెలువడ్డాయి. అభిషేక్ పదో తరగతి వరకు స్థానిక సెయింట్ థామస్ హైస్కూల్‌లో, ఇంటర్ హైదరాబాద్ ఘట్‌కేసర్‌లోని నారాయణ జూనియర్ కళాశాలలో, బీటెక్ సివిల్ ఇంజనీరింగ్ నాగపూర్‌లోని నిట్‌లో చదివాడు. కాగా, స్థానికులు హర్షం వ్యక్తం చేస్తూ అభిషేక్‌కు అభినందలు తెలిపారు.

సంతోషంగా ఉంది: అభిషేక్

ఐఈఎస్‌లో జాతీయ స్థాయిలో ఉత్తమ ర్యాంకు(42వ) రావడం చాలా సంతోషంగా ఉంది. తల్లిదండ్రులు ఎంతో కష్టపడి నన్ను చదివించారు. తమ్ముడు, స్నేహితుల ప్రోత్సాహంతో కష్టపడి చదివా. సమాజంలో ఉత్తమ ఉద్యోగిగా సేవలు అందిస్తా.

అత్తా, కోడళ్ల మాటలు నమ్మొద్దు..


పెద్దవంగర: ఎన్నికల ప్రచారంలో మాట్లాడుతున్న దయాకర్‌రావు


కొడకండ్ల ర్యాలీలో ప్రజలకు అభివాదం చేస్తున్న దయాకర్‌రావు

- కాంగ్రెస్ పార్టీకి ఓటేస్తే మోసపోతరు
- బీఆర్‌ఎస్ పాలకుర్తి అభ్యర్థి, మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు


తొర్రూరు : గిరిజన ఆశీర్వాద సభలో మాట్లాడుతున్న మంత్రి సత్యవతిరాథోడ్


పాలకుర్తి : ఎన్నికల ప్రచారంలో పాల్గొన్న ఎర్రబెల్లి ఉషాదేవి

పెద్దవంగర: అబద్ధాలు ప్రచారం చేసే అత్తా, కోడళ్లను నమ్మొద్దు.. వారు చెప్పే మాటలు విని కాంగ్రెస్‌కు ఓటేస్తే మోసపోతరని రాష్ట్ర మంత్రి, బీఆర్‌ఎస్ పాలకుర్తి అభ్యర్థి ఎర్రబెల్లి దయాకర్‌రావు అన్నారు. బుధవారం మండల పరిధి చిన్నవంగర, చిట్యాల, బొమ్మకల్లుతోపాటు మండల కేంద్రంలో ఆరోగ్యశ్రీ ట్రస్టు చైర్మన్ డాక్టర్ నెమరుగొమ్ముల సుధాకర్‌రావుతో కలసి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. స్థానిక మహిళలు మంత్రికి నుదుట తిలకం దిద్ది బతుకమ్మలు, కోలాటాలు, డప్పుచప్పుళ్లతో ఘన స్వాగతం పలికారు. రేలారే రేలా ఫేం గంగా, జానపద గాయని కనకవ్వ, జబర్దస్త్ ఫేం రాజమౌళి ఆటపాటలతో ప్రజలను ఆకర్షించారు. ఈ సందర్భంగా ఎర్రబెల్లి దయాకర్‌రావు మాట్లాడుతూ.. మీతో నిత్యం ఉంటూ మీ కష్టాల్లో పాలుపంచుకున్న తనను నమ్ముతారా.. ఇప్పుడు వచ్చి ఒక్క చాన్స్ ఇవ్వండని ప్రజల కాళ్లా, వేళ్లా పడుతున్న అత్తా, కోడళ్ల(ఝాన్సిరెడ్డి, యశస్వినిరెడ్డి)ను నమ్ముతారా అని ప్రశ్నించారు. బీఆర్‌ఎస్ ప్రభుత్వం ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలను నాడు కాంగ్రెస్‌కు పది అవకాశాలు ఇస్తే ఎందుకు అమలు చేయలేదని ప్రశ్నించారు. ఆ పార్టీకి ఓటేస్తే కరెంటు కోసం గోసపడిన రోజులు మళ్లీ వస్తాయని, ప్రజలు ఒక్కసారి పరిశీలన చేసుకోవాలని చెప్పారు. పాలకుర్తి నియోజకవర్గాన్ని అన్నిరంగాల్లో అభివృద్ధి చేశాను.. కరోనా కష్టా కాలంలో ఆనందయ్య మందును పార్టీలతో సంబంధం లేకుండా నియోజకవర్గ ప్రజలకు ఉచితంగా పంపిణీ చేసి కాపాడుకున్నానని పేర్కొన్నారు. ఆరోగ్యశ్రీ ట్రస్టు చైర్మన్ సుధాకర్‌రావు, ఎంపీపీ రాజేశ్వరి, జెడ్పీటీసీ జ్యోతిర్మయి, బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు ఈదురు ఐలయ్య, నాయకులు రామచంద్రయ్య శర్మ, కేతిరెడ్డి దీపిక సోమనర్సింహారెడ్డి, జలగం శేఖర్, సర్పంచ్‌లు, రావుల శ్రీనివాస్ రెడ్డి, జలగం లక్ష్మీ, ఎంపీటీసీలు తదితరులు పాల్గొన్నారు.

కేసీఆర్‌ను వదులుకోవద్దు : మంత్రి సత్యవతి

తొర్రూరు రూరల్: యాభై ఏళ్లుగా గ్రామాలతో సంబంధం లేకుండా వివక్షకు గురైన తండాలను గుర్తించి గ్రామ పంచాయతీలుగా చేసిన సీఎం కేసీఆర్‌ను వదులుకోవద్దని గిరిజన సంక్షేమశాఖ మంత్రి సత్యవతి రాథోడ్ అన్నారు. వెలికట్ట గ్రామ శివారులో నిర్వహించిన గిరిజన ఆత్మీయ ఆశీర్వాద సభలో ఆమె మాట్లాడారు. 'మన రాజ్యంలో మన పాలన'కు నాందీ పలికి గిరిజనుల ఆత్మ గౌరవాన్ని పెంచిన ప్రభుత్వం.. సేవాలాల్, తీజ్ పండుగలను అధికారికంగా నిర్వహించేందుకు చర్యలు తీసుకున్న సీఎం కేసీఆర్‌కు వచ్చే ఎన్నికల్లో అండగా నిలవాలని కోరారు. అభ్యర్థి ఎర్రబెల్లి దయాకర్‌రావు మాట్లాడుతూ.. ఈ ఎన్నికల్లో 60వేల భారీ మెజార్టీతో గెలుస్తానని, గతంలో మీ దీవెనలతో గెలిచి, కేసీఆర్ ఆశీర్వాదంతో మంత్రిగా తండాల్లో అవసరమైన సదుపాయాలు కల్పించి అభివృద్ధి చేశానని చెప్పారు. తెలంగాణ ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలు, అభివృద్ధి పనులు కొనసాగాలంటే మరోసారి ఆదరించాలని కోరారు. అనంతరం ర్యాలీలో గిరిజనులతో నృత్యాలు చేస్తూ ఎర్రబెల్లి సందడి చేశారు..

రెడ్డి సోదరులకు అండగా ఉంటా..

తొర్రూరు రూరల్: నియోజకవర్గంలోని రెడ్డి సోదరుల కష్టసుఖాల్లో పాలుపంచుకుంటూ ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటానని ఎర్రబెల్లి దయాకర్‌రావు అన్నారు. నాంచారీమడూరు శివారు రెడ్డి గార్డెన్‌లో ఏర్పాటు చేసిన రెడ్డి ఆత్మీయ సమ్మేళనంలో ఆయన మాట్లాడారు. రాష్ట్రంలో ఎక్కువ మంది వ్యవసాయ రంగంపై ఆధారపడి జీవిస్తారని, అందులో రెడ్డి కులానికి చెందిన వారే ఎక్కువగా ఉంటారని పేర్కొన్నారు. సీఎం కేసీఆర్ రైతులకు అవసరమైన సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నారని, వాటి కొనసాగింపునకు అవకాశం కల్పించాలని కోరారు. కార్యక్రమంలో వెంకటవరప్రసాద్‌రెడ్డి, కరుణాకర్‌రెడ్డి, నరసింహారెడ్డి, చిత్తరంజన్‌రెడ్డి, కిషోర్‌రెడ్డి పాల్గొన్నారు.

ఆలోచించి వేటు వేయాలి..

కొడకండ్ల: మూడు గంటల కరెంట్ కావాలో.. సీఎం కేసీఆర్ సారథ్యంలో నిరంతర కరెంట్ కావాలో ఆలోచించి ఓటు వేయాలని పాలకుర్తి అభ్యర్థి ఎర్రబెల్లి దయాకర్‌రావు అన్నారు. మండలంలోని లక్ష్మక్కపల్లి, రామన్నగూడెం, కొడకండ్ల గ్రామాల్లో నిర్వహించిన ఎన్నికల ప్రచార కార్యక్రమాల్లో ఆయన మాట్లాడారు. ఎర్రబెల్లి ట్రస్ట్ చైర్‌పర్సన్ ఉషాదయాకర్‌రావు తదితరులు పాల్గొన్నారు.

దయాకర్‌రావు గెలుపే లక్ష్యంగా కృషి చేయాలి

పాలకుర్తి: రాష్ట్రంలో ప్రజలకు సేవలు అందించిన ఎర్రబెల్లి దయాకర్‌రావు గెలుపే అంతిమ లక్ష్యంగా కృషి చేయాలని ఆయన సతీమణి, ఎర్రబెల్లి ట్రస్ట్ చైర్‌పర్సన్ ఉషాదేవి అన్నారు. బుధవారం పాలకుర్తిలో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఇదిలా ఉండగా. మండలంలోని పలు గ్రామాల్లో దివ్యాంగులు ప్రచారం నిర్వహించారు. ప్రజలకు అనేక సేవా కార్యక్రమాలు చేపట్టిన దయాకర్‌రావును అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు. దివ్యాంగుల సేవా సమితి నాయకులు పాల్గొన్నారు.

సేవలను చూసి గెలిపించాలి

రాయపర్తి: నియోజకవర్గానికి చేసిన సేవలను, అభివృద్ధిని చూసి ఎర్రబెల్లి దయాకర్‌రావును గెలిపించాలని బీఆర్‌ఎస్ మండల ఎన్నికల ఇన్‌చార్జ్ గుడిపూడి గోపాల్‌రావు పిలుపునిచ్చారు. కాట్రపల్లిలో కార్యకర్తలతో కలిసి ప్రచారం నిర్వహించిన ఆయన కారు గుర్తుకు ఓటు వేయాలని కోరారు. పార్టీ మండల ప్రధానకార్యదర్శి పూస మధు, సర్పంచ్ బోనగిరి ఎల్లయ్య, మండల శ్రీధర్, అన్వర్, ముద్రబోయిన శ్రీనివాస్, కత్తి సోమన్న పాల్గొన్నారు.

బీఆర్‌ఎస్‌లో గిరిజనుల చేరిక

దేవరుప్పుల: దేవరుప్పుల మండల పడమటితండా, లకావత్‌తండా, తూర్పుతండా(ఎం), కొడకండ్ల మండలం మైదంచెరువు, రాయపర్తి తండాలకు చెందిన గిరిజన యువత కాంగ్రెస్‌ను వీడి పాలకుర్తి ఎమ్మెల్యే అభ్యర్థి ఎర్రబెల్లి దయాకర్‌రావు సమక్షంలో బీఆర్‌ఎస్‌లో చేరారు. రామ్‌సింగ్, చింత సోమయ్య, ఎంపీటీసీ యాకూనాయక్‌పాల్గొన్నారు.

కార్మికుల సంక్షేమానికి పెద్దపీట


స్టేషన్‌ఘన్‌పూర్: అభివాదం చేస్తున్న కడియం శ్రీహరి, ఐలయ్య తదితరులు


చిల్పూరు: గేమ్యతండాలో ప్రచార ర్యాలీ నిర్వహిస్తున్న కడియం శ్రీహరి

- అందుబాటులో ఉండని వారికి ఓటేస్తే అధోగతే
- బీఆర్‌ఎస్ ఘన్‌పూర్ అభ్యర్థి 'కడియం'


ఖాజానగర్ తండాలో ప్రచారంలో కడియం


కడియం సమక్షంలో బీఆర్‌ఎస్‌లో చేరిన హబీబ్‌ఖాన్

స్టేషన్‌ఘన్‌పూర్: తెలంగాణ రాష్ట్రంలో బీఆర్‌ఎస్ ప్రభుత్వంలో సీఎం కేసీఆర్ అన్ని రంగాల కార్మికుల సంక్షేమానికి ప్రత్యేక చొరవతో పనిచేస్తున్నారని ఆ పార్టీ స్టేషన్‌ఘన్‌పూర్ ఎమ్మెల్యే అభ్యర్థి కడియం శ్రీహరి అన్నారు. డివిజన్‌కేంద్రంలోని ఓ ఫంక్షన్ హాల్‌లో బీఎస్‌ఆర్‌కేఎస్ ఆధ్వర్యంలో నియోజకవర్గంలోని వివిధ మండలాల భవన నిర్మాణ రంగాల కార్మికుల ఆత్మీయ సమావేశాన్ని బుధవారం నిర్వహించారు. బీఎస్‌ఆర్‌కేఎస్ రాష్ట్ర వ్యవస్థాపక అధ్యక్షుడు కామల్ల ఐలయ్య అధ్యక్షతన ఏర్పాటు చేసిన సమావేశానికి ముఖ్య అతిథిగా కడియం శ్రీహరి హాజరై మాట్లాడారు. భవన నిర్మాణ రంగాల కార్మికుల సంక్షేమానికి సీఎం కేసీఆర్ పెద్దపీట వేశారని, కార్మికులకు ప్రమాద బీమా రూ.6.30లక్షలు, సాధారణ బీమా రూ.లక్ష 30వేలు అందిస్తున్న ఘనత బీఆర్‌ఎస్ ప్రభుత్వానిదేనన్నారు. ఎన్నికల్లో కారు గుర్తుకు ఓటు వేసి ఆశీర్వదించాలని, ఎల్లవేళలా అందుబాటులో ఉంటూ అభివృద్ధి చేస్తానన్నారు. ఈ సమావేశంలో బీఆర్‌ఎస్ రాష్ట్ర నాయకులు సీహెచ్.నరేందర్‌రెడ్డి, బెలిదె వెంకన్నగుప్తా, మారుజోడు రాంబాబు, బీఎస్‌ఆర్‌కేఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎస్‌కే అలీ తదితరులు పాల్గొన్నారు.

కడియం శ్రీహరికే ముదిరాజ్‌ల మద్దతు

బీఆర్‌ఎస్ ప్రభుత్వంలో సీఎం కేసీఆర్ ముదిరాజ్‌ల సంక్షేమానికి ప్రత్యేక చొరవతో పనిచేస్తున్నారని బీఆర్‌ఎస్ అభ్యర్థి కడియం శ్రీహరికే తమ సంపూర్ణ మద్దతు ఇస్తున్నామని ముదిరాజ్ మహాసభ జిల్లా అధ్యక్షుడు నీల గట్టయ్య, జిల్లా మత్స్యశాఖ చీఫ్ ప్రమోటర్ నీల రాజు, జిల్లా డైరెక్టర్ బూర్ల శంకర్ అన్నారు. మండలంలోని రాఘవాపూర్, మీదికొండ, కొత్తపల్లి గ్రామాల్లో బుధవారం నిర్వహించిన ముదిరాజ్ మత్స్యసొసైటీల సమావేశంలో వారు పాల్గొని మాట్లాడారు.

కాంగ్రెస్, బీజేపీలు మాదిగల శత్రువులు

కాంగ్రెస్, బీజేపీ పార్టీలు మాదిగలకు శాశ్వత శత్రువులని, అంబేడ్కర్, పూలే ఆశయ సాధన కోసం పనిచేస్తున్న సీఎం కేసీఆర్‌కు, బీఆర్‌ఎస్‌కు తమ సంపూర్ణ మద్దతు ఇస్తున్నామని టీఎస్ ఎమ్మార్పీఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు మేడ స్వామి అన్నారు. డివిజన్ కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. బీఆర్‌ఎస్ అభ్యర్థి కడియం శ్రీహరిని భారీ మెజార్టీతో గెలిపించాలని ఆయన కోరారు.

కార్మిక పక్షపాతి సీఎం కేసీఆర్

తెలంగాణలో సీఎం కేసీఆర్ కార్మిక పక్షపాతిగా పనిచేస్తున్నారని, బీఆర్‌ఎస్ అభ్యర్థి కడియం శ్రీహరికే బీఆర్‌ఎస్ కార్మిక విభాగం సంపూర్ణ మద్దతు ఇస్తుందని బీఆర్‌ఎస్ కార్మిక విభాగం జిల్లా అధ్యక్షుడు వేముల నర్సింగం అన్నారు. డివిజన్ కేంద్రంలో భారత రాష్ట్ర ట్రేడ్ యూనియన్(బీఆర్‌టీయూ) మండల అధ్యక్షుడు సున్నం యాదగిరి అధ్యక్షతన ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు.

తండాలను అభివృద్ధి చేస్తా..

జఫర్‌గఢ్: తనను ఎమ్మెల్యేగా గెలిపిస్తే తండాలను అభివృద్ధి చేస్తానని కడియం శ్రీహరి పేర్కొన్నారు. మండలంలోని పలు తండాల్లో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయా తండాలకు చెందిన గిరిజనులు కడియం శ్రీహరికి ఘనంగా స్వాగతం పలికారు. అనంతరం ఆయన మాట్లాడారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ రడపాక సుదర్శన్, జెడ్పీటీసీ సభ్యురాలు ఇల్లందుల బేబి శ్రీనివాస్, ఆయా గ్రామాల సర్పంచ్‌లు తదితరులు పాల్గొన్నారు.

బీఆర్‌ఎస్‌లోకి పలువురు

మండల కేంద్రదానికి చెందిన కాంగ్రెస్ మండల మైనార్టీ నాయకుడు ఎండీ హబీబ్‌ఖాన్..కడియం శ్రీహరి సమక్షంలో బీఆర్‌ఎస్ పార్టీలో చేరారు. ఈ సందర్భంగా ఆయనకు గులాబీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు.

అందుబాటులో ఉండని వారికి ఓటువేస్తే అధోగతే

నియోజకవర్గంలో అందుబాటులో ఉండని వారికి ఓటు వేస్తే అధోగతేనని, అభివృద్ధికి పాటుపడే తనను గెలిపించాలని కడియం శ్రీహరి కోరారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా చిన్నపెండ్యాల, దేశాయితండాల పంచాయతీల పరిధిలోని గేమ్యతండా, సీతతండాల్లో ఎన్నికల ప్రచారం చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ తనను గెలిపించిన నెల రోజుల్లో అభివృద్ధి పనులు చేపడ్తానన్నారు. గ్రంథాలయ, చిల్పూరు ఆలయ చైర్మన్‌లు కృష్ణారెడ్డి, పొట్లపల్లి శ్రీధర్‌రావు, ఎంపీపీ సరిత బాలరాజు, సర్పంచ్‌ల ఫోరం మండల అధ్యక్షుడు లింగారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఇంటింటా ప్రచారం

కడియం శ్రీహరిని గెలిపించాలని జెడ్పీ చైర్మన్ పాగాల సంపత్‌రెడ్డి మండలంలోని పలు గ్రామాల్లో ఇంటింటా ప్రచారం నిర్వహించారు. సర్పంచ్‌లు లింగారెడ్డి, లొడెం రజితరవీందర్, రాజ్‌కుమార్, ఏదునూరి రవీందర్, ఎంపీటీసీ అయిలమ్మ ఎల్లయ్య, నాయకులు ఎంపీపీ సరితబాలరాజు తదితరులు పాల్గొన్నారు.

కడియం గెలుపునకు కృషి

కడియం శ్రీహరి గెలుపునకు గౌడ, కల్లుగీత కార్మిక సంఘం పూర్తి స్థాయిలో కృషిచేస్తుందని సంఘం జిల్లా అధ్యక్షుడు గద్దం రాజు అన్నారు. మండల కేంద్రంలో ఆ సంఘం మండల అధ్యక్షుడు గనగోని రమేష్ అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు.

పల్లగుట్టలో అన్ని కులాలు కడియం వైపే..

ఎన్నికల్లో బీఆర్‌ఎస్ పార్టీ అభ్యర్థి కడియం శ్రీహరికే పల్లగుట్టలోని అన్ని కులాలు పూర్తి మద్దతు ఇస్తాయని చిల్పూరు ఆలయ చైర్మన్, క్లస్టర్-4 ఇన్‌చార్జ్ పొట్లపల్లి శ్రీధర్‌రావు అన్నారు. మండలంలోని పల్లగుట్ట గ్రామానికి చెందిన వివిధ కులాల నాయకులు బుధవారం శ్రీధర్‌రావు, గౌడ సంఘం నాయకుడు చిర్ర నాగరాజు ఆధ్వర్యంలో కడియం శ్రీహరిని కలిసి పూర్తి మద్దతు తెలిపారు. అనంతరం వివిధ పార్టీల నాయకులు బీఆర్‌ఎస్‌లో చేరారు.